ప్రజాశక్తి
సోమవారం 11 సెప్టెంబరు 2023
5
శ్రీకాకుళం



## డిఆర్‌ఒగా గణపతిరావు బాధ్యతల స్వీకరణ

**శ్రీకాకుళం ప్రతినిధి :** జిల్లా రెవెన్యూ అధికారిగా ఎం.గణపతిరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన విజయనగరం డిఆర్‌ఒగా బాధ్యతలు నిర్వర్తించారు. డిఆర్‌ఒగా పని చేసిన రాజేశ్వరి స్థానంలో ఆయన నియమితులయ్యారు. ఆమె మూడు నెలలుగా సెలవులో ఉన్నారు. భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళీ కృష్ణ ఇప్పటివరకు ఇంఛార్జి బాధ్యతలను చూశారు. డిఆర్‌ఒ రాజేశ్వరిని సాధారణ పరిపాలనా శాఖకు రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. బాధ్యతలను స్వీకరించిన గణపతిరావు కలెక్టర్‌ను క్యాంప్ కార్యాయలంలో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు.

# అడుగంటిన భూగర్భ జలాలు

- ఆగస్టులో వర్షాభావ పరిస్థితులే కారణం
- చాలాచోట్ల కిందికి పడిపోయిన నీటిమట్టం నిల్వలు
- గతేడాది ఆగస్టుతో పోలిస్తే అర మీటరు మేర కిందికి చేరిన జలాలు

**జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీని ప్రభావం భూగర్భ జలాలపై పడింది. పలు మండలాల్లో నీటి నిల్వలు అట్టడుగుకు చేరాయి. చెరువులు, బావులు అడుగంటుతున్నాయి. కొన్ని మండలాల్లో ఎండిపోతున్న పంటలను బతికించుకోవడానికి నీరు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో వేలాది ఎకరాల్లో రైతులు పంటలను కోల్పోతున్నారు. ఆగస్టులో ప్రతి ఏడాది పుష్కలంగా వర్షాలు కురిసినా ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. దీంతో జిల్లాలో వేసవిలో ఉన్న పరిస్థితులు ఆగస్టులో కనిపిస్తున్నాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే అర మీటరు మేర నిల్వలు కిందికి దిగజారాయి.**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో చెప్పుకోదగ్గ వర్షాలు కురవలేదు. ఖరీఫ్ ప్రారంభం నుంచి నేటివరకు సాధారణ వర్షపాతమే నమోదైంది. ఈ సీజన్‌లో సాధారణ వర్షపాతం 567.9 మి.మీ కాగా, ఇప్పటివరకు 567.9 మి.మీ వర్షం కురిసింది. అదనంగా 4.1 శాతం వర్షం పడింది. 14 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, పది మండలాల్లో అధిక వర్షం కురిసింది. ఆరు మండలాలు తీవ్ర వర్షపాతం లోటును ఎదుర్కొంటున్నాయి.

ఈ వారంలో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిసినా పెద్దగా మార్పు కనిపించడం లేదు. వాటిలో కవిటి మండలం మొదటి స్థానంలో ఉంది. కవిటిలో ఈ సీజన్‌లో 654 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, ఇప్పటివరకు 330.9 మి.మీ వర్షం పడింది. 49.4 శాతం వర్షపాతం లోటును ఎదుర్కొంటోంది. ఇచ్ఛాపురం (45.9 శాతం), కంచిలి (45.8 శాతం), సోంపేట (36.7శాతం), నందిగాం (27.2శాతం), జి.సిగడాం (25.1శాతం) మండలాలు తీవ్ర వర్షపాతం లోటు జాబితాలో ఉన్నాయి. మెళియాపుట్టి, పలాస, మందస, వజ్రపుకొత్తూరు, హిరమండలం, సారవకోట, టెక్కలి, సంతబొమ్మాళి, జలుమూరు, బూర్జ, ఆమదాలవలస, పోలాకి, పొందూరు, గార మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.



కవిటి మండలం రాజపురంలో ఎండిపోయిన చెరువు

**నీటి నిల్వల పరిస్థితి ఇలా...**

జిల్లాలో ఈ ఏడాది ఆగస్టులో నీటిమట్టం నిల్వలు సగటున 5.33 మీటర్లుగా ఉంది. జూలైలో 5.56 మీటర్లుగా ఉంది. కవిటిలో జూలైలో 18.08 మీటర్ల లోతున నీరు లభ్యమయ్యే పరిస్థితి ఉండగా, ఇప్పుడు 33.91 మీటర్ల వరకు వెళ్తే గానీ నీరు దొరికే పరిస్థితి లేదు. నరసన్నపేటలో 5.87 మీటర్లు ఉండగా, ఆగస్టు వచ్చేసరికి 10.98 మీటర్లుగా ఉంది. సోంపేటలో 8.35 మీటర్లు కాగా, ప్రస్తుతం 8.92 మీటర్లుగా నమోదైంది. జి.సిగడాంలో 0.53 మీటర్లు కాగా ఆగస్టులో 0.75 మీటర్లుగా ఉంది. జలుమూరులో జూలైలో 2.50 మీటర్లు ఉండగా ప్రస్తుతం 3.29 మీటర్లుగా ఉంది.

**గతేడాది ఆగస్టులో ఇలా...**

గతేడాది ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే ఆగస్టులో నీటి నిల్వలు బాగా పడిపోయాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే జిల్లాలో నీటిమట్టం నిల్వలు 0.51కు పడిపోయాయి. నందిగాం, నరసన్నపేట ప్రాంతాల్లో అత్యధికంగా 6.33 మీటర్ల చొప్పున పడిపోయాయి. సోంపేటలో 3.27 మీటర్ల కిందికి నీరు చేరింది. పలాసలో నీటి నిల్వలు 2.12 మీటర్ల కిందికి దిగజారాయి. పాతపట్నంలో 1.82 మీటర్ల దిగువకు నీరు చేరింది. మెళియాపుట్టిలో 1.15 మీటర్ల కిందకు నీరు చేరింది.

## పోర్టు రోడ్డు భూసేకరణపై కోర్టుకు రైతులు

ప్రజాశక్తి - టెక్కలి

మూలపేట అదానీ పోర్టు అనుసంధాన రహదారి భూసేకరణలో రెవెన్యూ అధికారుల తీరుపై మండలంలోని మోదుగువలస, బన్నువాడ, వేములాడకు చెందిన 30 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. మూలపేట పోర్టుకు నిర్మాణం చేపట్టే ప్రయివేట్ రోడ్డు నిర్మాణం వల్ల తమ పంట పొలాలకు చెందిన నీరు ఆపసవ్య దిశలో ఉంటుందని, దీనివల్ల చిన్నపాటి వర్షాలకే మిగిలిన పంట పొలాలు వరద ముంపునకు గురవుతాయని రైతులు చెప్తున్నారు. దీనికితోడు వంశధార ఆయకట్టు నీటితో పాటు దాలిచెరువు నీటి ప్రవాహం కూడా తమ ప్రాంత పొలాలకే వస్తుందని, ఈ కారణంగా ముంపు మరింత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రోడ్డు నిర్మాణం జరిగితే మిగిలిన పంట పొలాలకు వెళ్లేందుకు మార్గం ఉండదని, ఇదే విషయాన్ని అప్పటి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి వివరించామన్నారు. అయినా రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు రైతులకు పంపిణీ చేసే నష్టపరిహారం విషయంలోనూ వివక్ష చూపుతున్నారని చెప్పారు. అధికారుల తీరుతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు.

## హస్తకళలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - పలాస

హస్త కళలను ప్రోత్సహించాలని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా ఆల్ ఇండియా క్రాఫ్ట్ బజార్ ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్తకళలు, చేనేత వస్తువులు ఉత్పత్తి ధరలకు విక్రయిస్తుండటంతో వినియోగదారులకు సరసమైన ధరలకు లభించే అవకాశం ఉందన్నారు. వత్తి కళాకారులకు చేనేత, హస్తకళా ఉత్పత్తి దారులను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతీ ఒక్కరికీ ఉందన్నారు. కాశీబుగ్గ-పలాస, చుట్టుప్రక్కల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశాఖ ఆర్టీసియన్స్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు మహ్మద్ నసీమ్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో హైదరాబాద్ మంచి ముత్యాలు, కలంకారి పెయింట్స్, మార్బుల్ బొమ్మలు, ఏటి కొప్పాక బొమ్మలు, పెయింటింగ్స్, బ్యాంబూ వర్క్స్, మెడిటేషన్ ఫోటోస్ ఇంకా ఎన్నో రకాల వస్తువులు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లు మీసాల సురేష్ బాబు, కష్టారావు, కౌన్సిలర్ డిక్కల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



హస్తకళల ప్రదర్శనను సందర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

## నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలి



- శాంతిభద్రతల సమస్య సృష్టించడం సరికాదు
- చట్టం ముందు అందరూ సమానులే
- రెవెన్యూ మంత్రి ధర్మాన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

దర్యాప్తు సంస్థలకు చంద్రబాబు సహకరించి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం మండలం పెద్దపాడులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం అంశం హడావుడిగా చేసింది కాదని, 2021లోనే కేసు రిజిస్టర్ చేశారని చెప్పారు. కేసులో 37వ ముద్దాయిగా చంద్రబాబు నాయుడు పేరును చేర్చి, ఈ రోజు కోర్టు ముందు హాజరు పరిచారని చెప్పారు.

చంద్రబాబు నాయుడును అరెస్టే చేయకూడదని ఎవరైనా వాదిస్తే అది ఎంత మాత్రం సబబు కాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరూ చట్టానికి అతీతులు కాదని, చట్టం ముందు అందరూ సమానమేన్నారు. ఏదైనా నేరం జరిగిందనుకున్నప్పుడు దర్యాప్తు సంస్థలు ప్రజాధనం రక్షించడం కోసం వాటిపని అవి చేస్తాయన్నారు. బాధ్యత గల ప్రజా నాయకులు దానికి సహకరించాల్సి ఉందన్నారు. ప్రజలను రెచ్చగొట్టే చర్యలను ఆ పార్టీ మానుకోవాలని హితవు పలికారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, పివి నరసింహారావు, మాజీ ముఖ్యమంత్రి జయలలిత, ప్రస్తుత సిఎం జగన్మోహన్ రెడ్డి కోర్టుల ముందు నిలబడలేదా అని ప్రశ్నించారు. ఆరోపణలు తప్పని రుజువు చేసుకుంటే తప్పకుండా చంద్రబాబు నిర్దోషిగా బయటపడతారని అన్నారు. స్కాంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు వ్యక్తులు దేశాన్ని విడిచి పారిపారిపోయారని చెప్పారు.

అనేక ఆధారాలతో ఛార్జిషీట్లు వేశామని, 37 మంది ఇందులో నిందితులుగా ఉన్నారని, అందులో చంద్రబాబు 37వ ముద్దాయిగా ఉన్నారన్నారు. ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పుడు దర్యాప్తునకు సహకరించాల్సిందేనని చెప్పారు. దర్యాప్తు చేస్తున్న సంస్థలకు సహకరించి, వారికి కావాల్సిన సమాచారం ఇచ్చి, ఏ తప్పూ చేయలేదని న్యాయ వ్యవస్థ ముందు నిరూపించుకోవాలని సూచించారు. విదేశాల్లో ఉన్న సంస్థకు ఇక్కడి నుంచి డబ్బు వెళ్లిందని చెప్తే, ఆ సంస్థతో తమకేం సంబంధం లేదని దబాయించడం ఏంటని ప్రశ్నించారు.

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com epaper.prajasakti.com

# నిరసనాగ్రహం

- చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి శ్రేణుల నిరాహార దీక్షలు
- పలుచోట్ల నాయకుల గృహ నిర్బంధం

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ జిల్లాలో రెండో రోజు ఆదివారం కూడా ఆందోళనలు కొనసాగాయి. ఆ పార్టీ శ్రేణులు, నాయకులు నిరాహార దీక్షలు చేపట్టారు. నిరసనలకు దిగుతారన్న అనుమానంతో కొందరు నాయకులను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. కవిటిలో పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా బయలుదేరిన ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కవిటి, ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ కె.రాము, రమేష్ సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. దీంతో ఆయనకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. శాంతియుతంగా చేపట్టే నిరసన కార్యక్రమాలను ఎందుకు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన రోడ్డుపైనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని విమర్శించారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తనపై ఉన్న అవినీతి మరకలను ఇతర నాయకులకు అంటించాలనే కుళ్లు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కక్షసాధింపు రాజకీయాలకు రాష్ట్రం వేదికగా మారిందని ఆక్షేపించారు. రాష్ట్రాభివృద్ధి కంటే ముఖ్యమంత్రి జగన్‌కు ప్రతీకారం తీర్చుకోవడమే ప్రాధాన్యమైపోయిందని దుయ్యబట్టారు. పోయేకాలం వచ్చింది కాబట్టే ఇటువంటి అరాచకాలు చేస్తున్నారన్నారు. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి తన క్యాంపు కార్యాలయంలో నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హౌస్ అరెస్ట్**

మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని పోలాకి మండలం కత్తిరివానిపేటలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. నరసన్నపేటలో జట్టు కళాసీల భవనం వద్ద నిరాహార దీక్ష చేపడుతున్న టిడిపి నాయకులను పోలీసులు చెదరగొట్టారు. పోలీసుల తీరుపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కవిటి : పార్టీ శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

**పలువురు నాయకుల గృహ నిర్బంధం**

పాతపట్నంలో చేపట్టే నిరాహార దీక్షలో పాల్గొనకుండా మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణను కొత్తూరు మండలం మాతలలోని తన నివాసంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు.



గౌతు శిరీషను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

శ్రీకాకుళంలో టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్న సామూహిక నిరాహార దీక్షలకు వెళ్లనీయకుండా మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిని గృహ నిర్బంధం చేశారు. శ్రీకాకుళం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో పలువురు నాయకులు సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. దీక్ష చేపట్టిన వారిలో నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు చింతు సుధాకర్ తదితరులు ఉన్నారు. పార్టీ నాయకులు ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు సాయంత్రం వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప జేశారు. కార్యక్రమంలో నాయకులు ఉంగటి రమణ, కొవ్వాది సుశీల, కొమర కమల తదిరులు పాల్గొన్నారు.

సోంపేటలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను హౌస్ అరెస్ట్ చేశారు. ఇంటి చుట్టూ భారీగా పోలీసులను మోహరించారు. 41 నోటీసు ఇచ్చి గౌతు శిరీష బయటకు వెళ్ళకుండా పోలీసులు అడ్డుకున్నారు.

పలాసలోని టిడిపి కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు నిరాహారదీక్షలు చేపట్టారు. దీక్షలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలంలో టిడిపి నాయకుడు కలిశెట్టి అప్పలనాయుడును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. దీంతో ఆయన తన నివాసం వద్దే నిరాహార దీక్ష చేపట్టారు.

టెక్కలిలో ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద నిరాహార దీక్ష చేపట్టిన టిడిపి నాయకులను పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా తోపులాట చోటుచేసుకుంది. కింజరాపు హరిప్రసాద్, దాసునాయుడు, బగాది శేషగిరిరావు, బోయిన రమేష్, పినకాన అజయకుమార్, జీరు బీమారావు తదితరులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

లావేరులో నిరాహారదీక్షలు చేపట్టడానికి సిద్ధమవుతున్న పలువురు నాయకులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. తాళ్లవలసలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, కేశవరాయునిపురంలో ఎఎంసి మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర, బెజ్జిపురంలో మాజీ జెడ్‌పిటిసి పి.మధుబాబును గృహ నిర్బంధంలో ఉంచారు. ఎచ్చెర్లలోని టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు నిరాహార దీక్షలు చేపట్టాయి.

ఆమదాలవలసలో టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత, టిడిపి మండల, పట్టణ అధ్యక్షులు నూకరాజు, ఎస్.మురళి తదితరులు పాల్గొన్నారు.

అండమాన్ నికోబార్ దీవుల్లో టిడిపి అభిమానులు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ ర్యాలీ చేపట్టారు. అండమాన్ నికోబార్‌లో మున్సిపల్ చైర్మన్ సెల్వి, వార్డ్ కౌన్సిలర్ ఎస్.అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పు చేస్తే శిక్ష తప్పదు

**వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్**



ప్రజాశక్తి - శ్రీకాకుళం

40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు హై ప్రొఫైల్ నేరస్తుడని, తప్పు చేస్తే పర్యవసానాలు ఇలాగే ఉంటాయని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎసిబి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిన నేపథ్యంలో కృష్ణదాస్ విలేకరులతో మాట్లాడారు. ఎన్నో స్కామ్‌లు చేసి వ్యవస్థలను మేనేజ్ చేసుకొని వస్తున్న చంద్రబాబు కథ అడ్డం తిరిగిందని తెలిపారు. ఎవరు ఎంత పైరవీలు చేసినా న్యాయమే గెలుస్తుందని రుజువైందని, మిగిలిన స్కాముల్లో కూడా చంద్రబాబు అండ్ కో పాల్పడిన అక్రమాలపై దర్యాప్తు జరపాలని సూచించారు. తప్పు చేస్తే తనకైనా శిక్ష తప్పదన్నారు. అక్రమాలకు పాల్పడలేదన్న విషయాన్ని చట్టప్రకారం కోర్టుకు నివేదించుకునే అవకాశం కూడా చంద్రబాబుకు ఉందని, అది మరచిపోయి ప్రభుత్వంపై బురద చల్లాలని ప్రయత్నించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ ఖజానాను దోచేసి, పోలవరం లాంటి ప్రాజెక్టులను ఎటిఎంలా వాడుకొని రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన చంద్రబాబుపై పూర్తిస్థాయి విచారణలు చేపట్టి తిన్న సొమ్మంతా కక్కించాల్సి ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుతో రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, వైసిపి శ్రేణులు వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



## పొంచి ఉన్న ప్రమాదం

- బీటలు వారిన వంతెన
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని నారాయణపురం గ్రామం వద్ద ఎడమ కాలువ పై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనపై అనునిత్యం వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తాడంతో ప్రస్తుతం శిధిలావస్థకు చేరుకుంది. ముఖ్యంగా అటు సంత కమిటీ మండలంలోని తమరం గ్రామం నుంచి నాగావళి నది నుంచి ఇసుకను ఇతర జిల్లాలకు ఒడిశా రాష్ట్రానికి అనునిత్యం లారీలలో ఇసుకను తరలిస్తున్నారు. నారాయణపురం ఆనకట్ట సమీపంలోని నాగవలి నది నుంచి కూడా ఇసుకను రాత్రింబవళ్లు తేడా లేకుండా తరలిస్తున్నారు.

ఇప్పటికే సైడ్ వాల్స్‌కు లారీలు ఢీ కొట్టడంతో పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు పలుమార్లు అధికారులకు వివరించినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఈ ప్రాంతవాసులు వాపోతున్నారు. ఈ వంతెన పైనుండే అంతర్ జిల్లాలకు బూర్జ సంతకవిటీ తదితర మండలాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇ ప్పటికైనా అధికారులు స్పందించి భారీ వాహనాల రాకపోకలకు అడ్డుకట్ట వేయాలని అలాగే శిధిలాస్తులకు చేరుకున్న వంతెనకు మరమ్మత్తులు జరిపించాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

## వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేలా చర్యలు

- రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలి
- విత్తనాలు, ఎరువులకు కొరత లేదు
- వ్యవసాయశాఖ జెడి శ్రీధర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి







జిల్లాలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీధర్ అన్నారు. జిల్లాలో ఇప్పటికే అన్ని రకాల పంటలు 84 శాతం మేర రైతులు వేయగలిగారని, వరి పంట 85 శాతం వరకు సాగవుతోందని తెలిపారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సాగు స్వల్పంగా ఉందని, సెప్టెంబర్ 15 వరకు ఆయా ప్రాంతాల్లో పరిస్థితులు కొంత మెరుగవుతాయన్నారు. ప్రత్యామ్నయ ప్రణాళిక ఏమీ లేనప్పటికీ అక్టోబర్ నుంచి మొదలు కానున్న రబీ సీజన్‌కు సబ్సిడీపై విత్తనాలు అందిస్తామని చెప్పారు. జిల్లాలో విత్తనాలు, ఎరువులకు కొరత లేదని, ఆయా మండలాలకు అవసరమైన మేర నిల్వలను ఆర్‌బికెల్లో ఉంచామని చెప్పారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు. 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

**జిల్లాలో పంటల సాగు పరిస్థితి ఎలా ఉంది?**

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు కలిపి 4 లక్షల 37 వేల 165 ఎకరాల సాగు లక్ష్యంగా నిర్ధేశించుకోగా 3,67,643 ఎకరాల్లో (84శాతం) పంటలు వేశారు. వరి పంటను 3,98,750 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా ఇప్పటివరకు 3,39,588 ఎకరాల్లో (85శాతం) సాగైంది.

**సెప్టెంబర్ రెండో వారంలోకి ప్రవేశించినా పూర్తిస్థాయిలో సాగు కాకపోవడానికి కారణాలేమిటి?**

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో అనుకున్నంత వర్షాలు పడలేదు. జిల్లాలో ఆరు మండలాల్లో తీవ్ర వర్షపాతం లోటు ఉంది. ప్రధానంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో వర్షాలు పడకపోవడం వల్ల రైతులు సకాలంలో విత్తనాలు వేయలేకపోయారు.

**వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళిక ఏమైనా అమలు చేస్తున్నారా?**

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 70 వేల ఎకరాల్లో పంటలు వేయలేదు. అందులో వరి 59 వేల ఎకరాల్లో విత్తనాలు పడలేదు. ఈ నెల 15 వరకు వేచి చూస్తాం. లక్ష్యం మేరకు దాదాపుగా సాగయ్యే అవకాశాలు ఉన్నాయి. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి రబీ సీజన్ మొదలు కానుంది. అప్పటికీ విత్తనాలు వేయలేకపోయిన రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తాం.

**ప్రస్తుత సీజన్‌లో విత్తనాలు, ఎరువుల సరఫరా ఎలా ఉంది?**

జిల్లాలో విత్తనాలు, ఎరువులకు కొరత లేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రాయితీపై 39,440 క్వింటాళ్ల విత్తనాలను అందించాం 57,042 మెట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేయాలని నిర్ణయించాం. అందులో ఆర్‌బికెల ద్వారా 34,589 టన్నులను అందించాం.

**పంటల ఈ-క్రాప్ ఎంతవరకు వచ్చింది?**

జిల్లాలో ఇప్పటివరకు 3.68 లక్షల ఎకరాల్లో పంటలు సాగయింది. ఇప్పటివరకు 1.50 ఎకరాల్లో ఈ క్రాపింగ్ పూర్తయింది. పంటల బుకింగ్‌కు ఈ నెల 15 వరకు గడువు ఉంది. ఆ తేదీగా పంటల క్రాపింగ్ పూర్తి చేస్తాం. రైతులు తప్పనిసరిగా ఈ క్రాపింగ్ చేయించుకోవాలి. లేని పక్షంలో ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు కోల్పోతారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తుతాయి.



పెద్దగంతరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

# కుమారన్న ఆశయసాధనకు కృషి

**ప్రజాశక్తి - పలాస**

కుమారన్న, సీతారాం ఆశయసాధనకు కృషి చేయాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని లొత్తూరు పంచాయతీ పెద్దగంతరులో ఆదివారం కుమారన్న, సీతారాం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. అమరవీరుల జెండాను గిరిజన సంఘ నాయకులు ఎస్.నారాయణ మాస్టారు ఆవిష్కరించారు. కుమారన్న కుమారుడు మల్లిబాబు అధ్యక్షత జరిగిన సమావేశంలో పలు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ దాదాపు 1500 ఎకరాల భూమిని కూడు గూడు లేని గిరిజనుల కోసం పంచి పెట్టిన వ్యక్తి కుమారన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎపి జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, జనశక్తి నాయకులు గురయ్య, ఆర్ మాధవరావు, సీతారాములు, పి దానేష్, వాసు, కుత్తుం వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం బ్రాహ్మణుల సృష్టి అని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. పెద్దగంతరులో కుమారన్న, సీతారాముల 25వ వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించారు. అరుణ పతాకాన్ని సీనియర్ గిరిజన సంఘం నాయకుడు సవర బంగ్లా కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జుత్తు వీరస్వామి, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు బైరు కూర్మారావు, మామిడి భీమారావు, వంకల పాపయ్య అరుణోదయ జిల్లా కార్యదర్శి కె.సోమేశ్వరరావు తదితరులు

# విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి - ఇచ్ఛాపురం**



విద్యారంగంలోని పలు సమస్యలను పరిష్కరించాలంటూ డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఇచ్ఛాపురం మండల శాఖ విజ్ఞప్తి చేసింది. సమావేశంలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోత ధర్మారావు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలని ఒపిఎస్ అమలు చేయాలని,పాఠశాల విలీనంనకు సంబంధించిన 117 జి వోను రద్దు చేయాలని, డిఎస్సిని ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. వాట్సాప్ అక్రమ బదిలీలు ఆపాలని, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ విజిట్ పేరుతో టీచర్లను ఆందోళనకు గురిచేస్తున్నారని, ఆయన వైఖరి మారాలని. అన్నారు. 3,4,5 తరగతలను హై స్కూల్‌లో విలీనం ఆపాలని, మాతభాషలో విద్యా బోధన జరపాలని కోరారు. ఈ సమావేశంలో కన్వీనర్‌గా చింతాడ పార్వతీశ్వరరావు, కో కన్వీనర్ గా పూజారి రమణమూర్తి, సభ్యులుగా. బి.శంకరరావు, కె. శ్రీనివాసరావు, జి. మోహనరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

# పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

**ప్రజాశక్తి - శ్రీకాకుళం**



విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా ఎంతో విజ్ఞానం పొందవచ్చునని బలగ శాఖా గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను అన్నారు. బలగ శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలకి కథలు చెప్పి వారి చేత కథలు చెప్పించడం తదుపరి తెలుగు పుస్తకాలు చదివించి వారి తప్పులు సరిదిద్ది బాగా చదివిన విద్యార్థులకు ప్రతి ఆదివారం ఈ కార్యక్రమంలో బహుమతి అందజేస్తున్నామని పేర్కొన్నారు ప్రతి విద్యార్థి తనకు అందుబాటులో ఉన్న గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే ఎంతో విజ్ఞానాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### టిడిపి శ్రేణులు సిగ్గుపడాలి

**ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు**


మాట్లాడుతున్న వెంకటరావు

చంద్రబాబు నాయుడు చేసిన పనికి టిడిపి శ్రేణులు సిగ్గుపడాలి తప్ప సానుభూతి చూపకూడదని జిల్లా ప్రణాళిక బోర్డు మాజీ సభ్యులు వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు హనుమంతు వెంకట్రావు దొర హితవు పలికారు. ఆదివారం వజ్రపుత్రులోని వైఎస్ఆర్‌సిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూట్ కేస్ కంపెనీల ద్వారా ప్రభుత్వ సొమ్మును ముఖ్యమంత్రి హెూదాలో ఉండి లూటీ చేయాలనుకున్న చంద్రబాబుకు సరైన శాస్తి జరిగిందని అన్నారు. సిఐడి కి బలమైన ఆధారాలు లభించడంతోనే చంద్రబాబును అరెస్ట్ చేశారని అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు టిడిపి కార్యకర్తలను రెచ్చగొట్టి వైసిపిపై లేనిపోని అభాండాలు వేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ మండల వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు పుక్కల గురయ్య నాయుడు వైస్ ఎంపిపి తమ్మినాన శాంతారావు, సర్పంచ్ మామిడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### కుట్టుమిషన్ల పంపిణీ

**ప్రజాశక్తి - సోంపేట**



స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 100 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ సేవే ధ్యేయంగా రోటరీ క్లబ్ పనిచేస్తుందన్నారు. పట్టణంలోని నిరుపేద మహిళలు తమంతట తాముగా ఉపాధి పొందేందుకు వీలుగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు భవిష్యత్తులో సైతం మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు పి.వి కష్ణారావు, కె.రవికుమార్, దినేష్‌తో పాటు రోటరాక్ట్ సభ్యులు బెనర్జీ, మనీ, సంతోష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి - సోంపేట**

మండలంలోని పలాసపురం గ్రామంలోని కపిలేశ్వర విరంచి నారాయణ ఆలయంలో నూతనంగా నిర్మించనున్న భవనానికి స్థానిక జడ్పిటిసి తడక యశోద ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి తడక జోగారావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### రాయలలో పొలంబడి


**ప్రజాశక్తి - కొత్తూరు**



మండలంలోని రాయల గిరిజన గ్రామంలో శనివారం పొలం బడి కార్యక్రమం వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. రాయల, లబ్బ, ఆల్తి గిరిజన గ్రామాల్లో ప్రకతి వ్యవసాయంపై దష్టి సారించారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు టి.సూర్యనారాయణ, జనార్ధన, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వాలంటీర్లకు న్యాయం చేయాలి

**ప్రజాశక్తి - కవిటి**


మధు బోర్ణబోధ పుస్తకాలతో ఒడియా లింగ్విస్టిక్ మైనారిటీ సంఘం సభ్యులు

ఒడియా మాధ్యమంలో విద్యా వలంటీర్లుగా సేవలందిస్తున్న 130 మందికి కనీస వేతనం రూ.3 వేలు నుంచి రూ.5 వేలుకి పెంచి వారికి న్యాయం చేయాలని ఒడియా లింగ్విస్టిక్ మైనారిటీ సంఘం కోరింది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం భువనేశ్వర్‌లో ఉత్కళ సమ్మిలిని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అద్వైత కుమార్ పాత్రో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్ర కుమార్ మిశ్రాలను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందావన్ దొలై మాట్లాడుతూ ఒడియా పాఠశాలలకు టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్, లైబ్రరీ పుస్తకాలు అందించాలని కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్ లో ఒడియా భాష అభివద్ధికి కషి చేయాలని కోరారు. ముఖ్యంగా130 మంది విద్యా వాలంటీర్లను నియమించి ఉపాధ్యాయుల కొరత తీర్చిన ఒడిశా ప్రభుత్వానికి, ఉత్కళ సమ్మేళని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉత్కళ సమ్మిలని అధ్యక్షుడు అద్వైత కుమార్ పాత్రో మాట్లాడుతూ విద్యా వాలంటీర్ల జీతాలు పెంచి, ఒడియా టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్, లైబ్రరీ పుస్తకాల పంపిణీకి ప్రపోజల్ పంపిస్తామని చెప్పారు. అలాగే ఒడియా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల కోసం 'మధు బోర్ణబోధ' పుస్తకాలు ఒడియా డిఐ దుర్గా ప్రసాద్ చౌదరికి అందించారు. ఈ కార్యక్రమంలో ఒడియా లింగూస్టిక్ మైనారిటీ సంఘ అధ్యక్షుడు సత్యనారాయణ పాడి, ఒడియా డిఐ దుర్గాప్రసాద్ చౌదరి, ఇచ్ఛాపురం బాపూజీ పాఠఘర్ అధ్యక్షుడు రఘునాథ్ గౌడ్, అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందావన్ దొలై, ఉత్కళ సమ్మిలిని సూపర్వైజర్లు ప్రదోష త్రిపాఠి, విద్యాధర బెహరా తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్య కలలు సాకారం



**ప్రజాశక్తి - లావేరు**

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య పాలన మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మెహన్ రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందిస్తున్నారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. లావేరు మండలం లావేరు పంచాయతీలో రూ. 40 లక్షలు వ్యయంతో లావేరు-1 నూతన గ్రామ సచివాలయం భవనాన్ని వీరిద్దరూ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు ఆయా గ్రామాల పరిధిలోనే వారి సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ గారు మాట్లాడుతూ ఈ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్త పింఛన్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, లావేరు మండలం ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు దన్నాన రాజినాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి లుకలాపు శ్రీనివాసరావు, రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కింతలి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# మూడో బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్ ఆత్మీయ కలయిక

**ప్రజాశక్తి - ఆమదాలవలస**


పూర్ణచంద్రరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ సైనికులు

మూడో బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికుల ఆత్మీయ కలయిక పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం 1965 ఆపరేషన్ రిడ్డుల్ వార్‌లో మహరాజ్ కే విలేజ్ నీ క్యాప్చర్ చేసిన దానిని అది ఒక బ్యాటిల్ హానర్ గా గుర్తుచేసుకుని గెట్ టు గెదర్ ని సెలబ్రేట్ చేసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి మాజీ సైనికులు తమ కుటుంబ సభ్యులతో కలసి ఇక్కడకు వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నామని తెలిపారు. ఇటువంటి కార్యక్రమ ం జరుపుకోవడం చాలా ఆనందంగా ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత బ్రిగేడియర్ సహనవాజ్, విశ్రాంత కల్నల్ బి.ఎస్. రావు, హానరరీ కెప్టెన్ జి.టి.రావు, సుబెదార్ కె.ఎల్.రావు, హవల్దార్ బి.ఈశ్వరరావు, ప్రసాదరావు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

# గ్రామ సంఘ కార్యాలయం ప్రారంభం


ప్రారంభిస్తున్న సర్పంచ్ జయలక్ష్మి

**ప్రజాశక్తి - ఆమదాలవలస**

స్వయం సహాయక సంఘ మహిళలు తమ కార్యక్రమాల నిమిత్తం కార్యాలయాన్ని మండల మహిళా సమాఖ్య కోశాధికారి రేణుకా మొహరాన్ ఆధ్వర్యంలో సర్పంచ్ గురుగుబెల్లి జయలక్ష్మి ప్రారంభించి మహిళలకు అప్పగించారు. మండలంలోని అక్కివరం పంచాయతీలో మహిళా స్వయంశక్తి సంఘాలతో ఏర్పాటైన తోటాడ - 2 మహిళా పరస్పర సహాయ సహకార గ్రామ సంఘం 1995 చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ గ్రామ సంఘంలో 41 స్వయం శక్తి సంఘాలలో 465 మంది సభ్యులుగా ఉన్నారు. ఇందులో 36 సంఘాలు ఏ గ్రేడ్ లోనూ, 4 సంఘాలు బి గ్రేడ్ లోనూ, 1 సంఘం సీ గ్రేడ్ లోనూ ఉన్నాయి . ప్రతి నెల సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ, ప్రస్తుతం శత శాతం తీసుకొన్న రుణాలను రీపేమెంట్ చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు ,కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకొని అర్హులంతా సద్వినియోగం చేసుకుంటున్నారు. మండలంలో గల అందరు సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు అంతా తమ పంచాయితీలో గల గ్రామైఖ్య సంఘాల మహిళలకు సమావేశాల నిర్వహణకు, స్వంత కార్యాలయాలను ఏర్పాటు చేయించి ,ప్రారంభిస్తున్నందులకు వైఎస్సార్ క్రాంతిపథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు కతజ్ఞతలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు గురుగుబెల్లి నీలారావు, క్లస్టర్ కోఆర్డినేటర్ రమణ, వివోఎ రాజేశ్వరితో పాటు గ్రామ సంఘం ప్రతినిధులు ఎం.రేణుక, బి.కుమారి, కె.అనురాధ తదితరులు పాల్గొన్నారు.


పట్టు సాగును పరిశీలిస్తున్న ఎడి అరుణ కుమారి

## పట్టు సాగుతో అధిక ఆదాయం

**ప్రజాశక్తి - పొందూరు**

పట్టుపురుగుల పెంపకంతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చునని గుంటూరు జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సి.అరుణకుమారి అన్నారు. పొందూరు మండలంలోని రాపాక, మలకాం గ్రామాలలో ఆదివారం పట్టుబడి శిక్షణా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో పట్టుసాగుకు సంబంధించి క్షేత్ర పరిశీలన చేశారు. ఈ పంటను సాగుచేసే రైతులకు ప్రభుత్వం అందించే పథకాలను ఆమె తెలియజేశారు. ఆయా గ్రామాలలో కొత్తగా నిర్మించిన చాకీ రేరింగ్‌ను ఆమె ప్రారంభించారు. రైతులతో చర్చాగోష్టులు నిర్వహించి రైతుల సమస్యలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి టి.రాజేంద్రప్రసాద్, సిహెచ్‌కె రత్నకుమారి, ఆ శాఖ విజయనగరం, విశాఖపట్నం జిల్లా అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## చేయి చేయి కలిపారు... గుంతలు పూడ్చారు

**ప్రజాశక్తి - బూర్జ**

శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారికి అనుకుని ఉన్న రామన్నపేట గ్రామం వద్ద ఏర్పడిన గుంతల కారణంగా ప్రమాదాలు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా రాత్రుల వేళల్లో ఈ గుంతలలో ద్విచక్ర వాహన చోదకులు, బాటసారులు కూడా ప్రమాదవశాస్తూ పడిపోయి గాయాలు పాలవుతున్న ఘటనలు చూసిన ఆ గ్రామస్తులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా స్పందించకపోవడంతో గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు ఆదివారం ఉదయం ఆ గుంతలను మట్టితో కప్పిపుచ్చారు. వీరి సేవలకు గ్రామస్తులు అభినందించారు.


గుంతలను పూడ్చుతున్న మహిళ

## మహిళా సంఘాల వితరణ

**ప్రజాశక్తి - ఇచ్ఛాపురం**

ఇటీవల బెల్లుపడ త్రినాథపేటలో గంజి లక్ష్మి ఇల్లు కాలిపోయిన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి ఆ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం బాధిత కుటుంబ పరిస్థితిని వార్డులో స్వయం శక్తి సంఘాల సభ్యులకు వివరించారు. ఆమె విజ్ఞప్తి మేరకు 12, 13 వార్డులకు సంబంధించి గణేష్, ధరణి, శ్రీలక్ష్మి నరసింహ సంఘాలకు చెందిన 75 గ్రూపుల్లో మహిళలందరూ 170 కిలోల బియ్యం, 2 కేజీల కాయగూరలు, రూ. 4 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

## వార్డు సమస్యలపై స్పందించిన కౌన్సిలర్

**ప్రజాశక్తి - ఇచ్ఛాపురం**

22వ వార్డులోని కాలువలో బురద మట్టి పేరుకుపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ యాదవ్ మున్సిపల్ అధికార యంత్రాంగం దష్టికి తీసుకొచ్చారు. దీంతో వార్డ్‌లో కాలువలో పేరుకుపోయిన బురద మట్టిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఆ పనిని దగ్గరుండి తొలగించే కార్యక్రమాన్ని చేపట్టడంతో పలువురు అభినందించారు.

## గ్రంథాలయ అభివృద్ధికి కృషి

**ప్రజాశక్తి - పలాస**



ఉద్దానం ప్రాంతంలో గ్రంథాలయ అభివద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఉపాధ్యాయులు పి.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని నీలావతి గ్రామంలో ఉన్న ఉద్దాన విద్య అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నడుస్తున్న గ్రంథాలయానికి ఆదివారం సుమారు 300 పుస్తకాలను వితరణ చేశారు. కార్యక్రమంలో యువివి ప్రతినిధులు కుత్తుం ప్రకాశరావు, తంగుడు ఖగేశ్వరరావు, లైబ్రేరియన్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



## గణపతి స్వామికి పిహెచ్‌డి

**కొత్తూరు :** మండలంలోని గులివిందలపేట గ్రామానికి చెందిన చింతాడ గణపతి స్వామి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులు మీదుగా పిహెచ్‌డిని అందుకున్నారు. దీంతోపాటు బంగారు పతకాన్ని స్వీకరించారు. ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్టేటస్టిక్స్ విభాగంలో పరిశోధనకు గానూ ఈ పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, జిఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జున, ఉప కులపతి ప్రసాద్‌రెడ్డి, చైర్మన్ గన్ని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## గణపతిరావుకు డాక్టరేట్ ప్రదానం



**పలాస :** పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయనిగా పనిచేస్తున్న మూల గణపతిరావుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.మోహన్‌బాబు పర్యవేక్షణలో 'రామతీర్థ సాహిత్యం-పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, జి.ఎం.అర్. సమక్షంలో వైస్ ఛాన్సలర్ ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ఎయు కాన్వకేషన్ హాల్లో శనివారం డాక్టరేట్ అందుకున్నారు.. దీంతో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.దాశరథి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

**పలాస విద్యార్థికి డాక్టరేట్**

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు చిన్న బ్రాహ్మణ వీధికి చెందిన రోష్మిత పండా ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. భారతదేశంలో ప్రాంతీయ వాతావరణ అనుకరణ అంశంపై విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీ కాన్వకేషన్‌లో రోష్మిత పాండా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కాశీబుగ్గ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన రోష్మిత పండా ఆ తరువాత పై చదువులు చదువుతూ ఆంధ్ర యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఎస్ఎస్వి ఎస్ రామకష్ణ మార్గదర్శకత్వంలో డబ్ల్యూఆర్ఎఫ్ మోడల్‌ని ఉపయోగించి ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు సంతోష్

## ఉచిత వైద్య శిబిరం

**ఇచ్ఛాపురం :** జెసిఐ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వారోత్సవాలలో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి 15 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. అందులో భాగంగా మండలంలో ఈదుపురం గ్రామంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.. జెసిఐ సభ్యులు డాక్టర్ సంతోష్. గర్భిణులకు రక్త, బిపి పరీక్షలు చేసి ఉచితంగా మందులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను 25 మంది పరీక్షలు చేయించుకున్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న యువజన సంఘం ప్రతినిధులు

## చికిత్సకు నగదు అందజేత

**సంతబొమ్మాళి :** సంతబొమ్మాళి గ్రామంలో ఎనిమిది నెలల వయసున్న అనంతు రుక్మిణి పాప పుట్టిన మూడు నెలల నుంచే కంటి సమస్యతో బాధ పడుతోంది. తల్లి రేణుక కొద్దిపాటి సొమ్ముతో శ్రీకాకుళంలో కంటి హాస్పిటల్‌లో చూపించగా విశాఖ, అక్కడ నుంచి హైదరాబాద్ వెళ్లాలని సూచించగా అక్కడ వరకు వెళ్లడానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. వీరి పరిస్థితిని తెలుసుకున్న సంతబొమ్మాళి యువత సోషల్ మీడియా ధ్వారా పలు సంఘాల సభ్యుల నుంచి రూ.38,400లు సేకరించారు. ఈ కార్యక్రమంలో అట్టాడ సాయికుమార్, సర్పంచ్ ప్రతినిధి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న చిన్నారావు స్నేహితులు

## స్నేహితుని కుటుంబానికి సాయం

**కోటబొమ్మాళి :** మండలంలోని పొడుగుపాడుకు చెందిన తమతోపాటు చదువుకున్న చిన్ననాటి స్నేహితుడు తిర్లంగి చిన్నారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి స్నేహితులు రూ.92 వేలు ఆర్థికసాయం చేశారు. 1999-2000 విద్యా సంవత్సరం జర్జంగి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ తమ మిత్రుడు తిర్లంగి చిన్నారావు మరణ వార్తవిని, ఆయన పిల్లల ఉన్నత చదువుల నిమిత్తం రూ. 92 వేలు ఆర్థిక సహాయం అందించి, ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. చిన్నారావు మిత్రులు చేసిన సహాయానికి గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయన చిన్ననాటి మిత్రులు గొండు నారాయణరావు, చాప ఉషారాణి, కోన కోటేశ్వరరావు, పేడాడ మోహనరావు, చాప అప్పలనాయుడు, మెట్ట వాసుదేవరావు, గంగిట్ల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.